
# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 145
పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం
మార్చి 03, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## మాజీ ఎమ్మెల్యే 'వన్నాల'కు సతీ వియోగం


- మాజీ ఉపరాష్ట్రపతి, పలువురు గవర్నర్లు, పద్మశాలీల సంతాపం
- హనుమకొండలో ముగిసిన అంత్యక్రియలు

వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు సతీమణి వన్నాల విజయలక్ష్మి (70) కన్నుమూశారు. అనారోగ్యంతో హైదరాబాద్ లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో గత కొంతకాలంగా చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం సాయంత్రం తుది శ్వాస విడిచారు.

7లో..

# పేరుకే బంద్..

## తరలింపు యధాతథం



- ఆగని ఇసుక అక్రమ రవాణా
- ఒక్కో ట్రిప్పుకు రూ. 7 వేల నుంచి రూ. 8 వేలు వసూలు
- ఇబ్బందులు పడుతున్న గృహ నిర్మాణదారులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామంటూ ఉన్నతాధికారులు ప్రకటిస్తున్నా ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. వాగులు, వంకల నుంచి యథేచ్ఛగా ఇసుక తరలి పోతూనే ఉంది. ముందస్తుగానే వ్యవసాయ బావులు, ఇండ్లలో డంప్ చేసిన ఇసుకను బ్లాక్ చేసి అధిక ధరకు అమ్ముతూ భారీగా డబ్బు దండుకుంటున్నారు. గతంలో ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయించగా నేడు అదే ఇసుకను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు రూ.7 వేల నుంచి రూ.8 వేలు వసూలు చేస్తున్నారు. కేవలం 6, 7 కిలోమీటర్ల దూరం కూడా లేని గ్రామాల వారికి సైతం అదే అధిక ధరకు విక్రయిస్తుండడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇసుక రవాణాను కట్టుదిట్టం చేయడం ఇసుకాసురులకు కలిసి వచ్చిందనే చెప్పవచ్చు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్న అధికారులు అదే విధంగా గృహ నిర్మాణాలకు కావాల్సిన ఇసుకను సరఫరా చేయడంపై దృష్టి సారించడం లేదు. దీంతో గృహ నిర్మాణదారులు అధిక మొత్తాలకు ఇసుకను కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

- వరంగల్ వాయిస్, తొర్రూరు



8లో..

## నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

- సీఎం రేవంత్ నాయకత్వంలో వరంగల్ దశ, దిశ మారనుంది
- రాష్ట్ర ప్రభుత్వం కృషితోనే ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



2లో..

## ఆకేరు వాగు ఎండింది..
## అన్నదాత కడుపు మండింది

- కానరాని ఎస్సారెస్పీ నీళ్లు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ధ్వజం




WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, మార్చి 03, 2025

# ప్రజావాణిలో 88 ఫిర్యాదులు

- స్వీకరించిన కలెక్టర్ సత్య శారద
- త్వరితగతిన పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి పాల్గొని ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 88 దరఖాస్తులు రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. భూ సంబంధిత సమస్యలపై ఎక్కువగా 23 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కలెక్టరేట్ సూపరింటెండ్ పై 15, జిల్లా వ్యవసాయ శాఖ 11, జీడబ్ల్యూఎంసీపై రెండు, డీసీఎస్ఓకు ఐదు దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కరించలేని దరఖాస్తులు ఏమైనా ఉంటే అవి ఎందుకు పరిష్కరించలేదో దరఖాస్తుదారుడికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. లేకుంటే వచ్చిన దరఖాస్తులే మళ్లీ మళ్లీ వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు గ్రీవెన్స్ పోర్టల్ లో ఉన్న వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ విజయలక్ష్మి ,వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, డీఆర్డీఓ కౌసల్య దేవి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీపీఓ కల్పన, వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



### బల్దియాలో 63..

వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో సోమవారం అదనపు కమిషనర్ జోనా, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 63 దరఖాస్తులు వచ్చినట్లు ప్రకటించారు. ఇందులో ఇంజనీరింగ్ విభాగానికి చెందినవి 13, హెల్త్, సానిటేషన్ పై ఆరు, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ)కు ఎనిమిది, టౌన్ ప్లానింగ్ విభాగంపై 31, మంచినీటి సరఫరాపై నాలుగు, హార్టికల్చర్ విభాగంపై ఒక దరఖాస్తు వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, హెచ్ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, ఇంచార్జి సీపీ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.






# కబడ్డీ విజేతలు..

- బొల్లికుంట, ఖిలా వరంగల్ విద్యార్థులు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ ఆధ్వర్యంలో ఈనెల 1,2 తేదీల్లో నిర్వహించిన ఇన్విటేషనల్ ఇంటర్–కాలేజ్ టోర్నమెంట్‌లో బొల్లికుంట, ఖిలా వరంగల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ పోటీల్లో అన్ని అగ్రశ్రేణి ఇంజనీరింగ్, ఫార్మసీ, వైద్య కళాశాల విద్యార్థులు పోటీ పడ్డారు. వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ బాలుర విద్యార్థులు కబడ్డీ మొదటి బహుమతిని గెలుచుకున్నారు. ఈ మేరకు జట్టు సభ్యులకు ట్రోఫీ, బంగారు పతకాలు, సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రకాష్ మాట్లాడుతూ వివిధ క్రీడలు, ఆటలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. రెగ్యులర్ చదువులతో పాటు కళాశాలలో తరచుగా ఇంటర్–బ్రాంచ్ టోర్నమెంట్ల ద్వారా విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సీహెచ్.వాణి దేవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ పి.అజయ్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు బానోత్ పవన్, కత్తుల శ్రీకాంత్, అంబటి నాగరాజు, షకీర్, కళాశాల కబడ్డీ పురుషుల జట్టు కెప్టెన్ కె.రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# ఆకేరు వాగు ఎండింది.. అన్నదాత కడుపు మండింది

- కానరాని ఎస్సారెస్పీ నీళ్లు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ధ్వజం





**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ఆకేరు వాగు ఎండింది..అన్నదాత కడుపు మాడిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. సాగునీరు లేక బోర్లు పడక అన్నదాతలు అరి గోస పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం రావూరు గ్రామంలోని ఆకేరు వాగుపై ఉన్న చెక్ డ్యామ్ ఎండిపోవడంతో ఆ గ్రామ రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. సాగునీరు లేక చేతికి వచ్చిన పంట కండ్ల ముందే ఎండి పోతుంటే చావే శరణ్యం అనుకున్న రైతులకు దయాకర్ రావు నేనున్నానంటూ అండగా నిలిచారు. ఫోన్ ద్వారా సాగునీటి కష్టాలను దయాకర్ రావుకు వివరించగా స్పందించిన ఆయన పార్టీలను పక్కనబెట్టి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈఎన్సీ ఎస్ఈ, ఈఈ, డీఈలతో ఫోన్ లో మాట్లాడి నీటిని విడుదల చేయాలంటూ కోరారు. అధికారులు సైతం ఈ దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దయాకర్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో వర్ధన్నపేట నియోజకవర్గంలోని చెరువులు ఎండాకాలం కూడా మెత్తడి పడేవన్నారు. కాంగ్రెస్ వస్తేనే కష్టాలు తప్పవని ఆరోపించారు. ఆకేరు వాగు చెక్ డ్యామ్ నిత్యం నీటితో కళకళ లాడుతుండేదని గుర్తు చేశారు. ఈ చెక్ డ్యామ్ మీద కొత్తపల్లి, ల్యాబర్తి, బంధనపల్లి, కొత్తూరు, రోళకల్లు, రావూరు, పర్వతగిరి, కల్లెడ, అన్నారం, సోమారం, జామస్థాన్ పురం, మడిపల్లి, గుర్తూరు రైతులు ఆధారపడి వ్యవసాయం చేస్తూ సుమారు వెయ్యి ఎకరాల పైచిలుకు పంట సాగు చేసేవారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నీళ్లు విడుదల చేయాలని ఎర్రబెల్లి దయాకర్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ కమలా పంతులు, మాజీ సర్పంచులు చింతపట్ల మారుతి, సోమేశ్వరరావు, బండి సంతోష్, ఆమడగాని రాజు యాదవ్, విజయ్, మాదుగుల రాజు, మాజీ వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ పర్వతగిరి, ఉప సర్పంచ్, మాజీ ఉపసర్పంచులు ఆమ్లా నాయక్, నరేష్, సొసైటీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, గడ్డి యాకయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు చింతల శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు బూర శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డ పెళ్లికి పద్మశాలి సంఘం అండ

- పెళ్లి ఖర్చులకు రూ.11 వేల ఆర్థిక సాయం

**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** ఆడ బిడ్డ పెళ్లికి కమలాపూర్ పద్మశాలి సంఘం అండగా నిలిచింది. కమలాపూర్ కు చెందిన చందనాల చిరంజీవి–కోమల దంపతుల కుమార్తె దీక్షిత వివాహానికి ఆర్థిక సాయం అందజేసి తమ దాతృత్వం ప్రకటించారు. ఆదివారం నిర్వహించిన వివాహ వేడుకలకు హాజరైన పద్మశాలి కుల సంఘ పెద్దలు పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్ చేతుల మీదుగా రూ.11 వేల ఆర్థిక సాయాన్ని పెళ్లికూతురు తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి, జిల్లా మీడియా కో–ఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఎస్సార్ఎఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ అమరేష్, పద్మశాలి సంఘం నాయకులు వావిలాల మురళి, వెల్ది కుమార్, ఆడెపు శ్రీకాంత్, పులికంటి ప్రభాకర్, కనుకుంట్ల శ్రీనివాస్, ఆడెపు సురేష్, కుల బాంధవులు పాల్గొన్నారు.

# పార్టీ విధేయులకే టికెట్లు కేటాయించాలి



### జిల్లా నాయకులు రాపోలు రామ్మూర్తి

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను జిల్లా నాయకులు రాపోలు రామ్మూర్తి మర్యాద పూర్వకంగా సోమవారం గాంధీ భవన్ లో కలిసి పార్టీకి సంబంధించిన పలు అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, పాక్స్, మున్సిపాలిటీల్లో పార్టీ కోసం కష్టపడిన వారికే టిక్కెట్లు కేటాయించి అండగా నిలవాలని కోరారు. సీనియర్ నాయకులకు వారి అర్హతల వారీగా నామినేటెడ్, పార్టీ సంబంధమైన పదవులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- విద్యార్థులు సకాలంలో హాజరు కావాలి
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశమై పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి నెల 5 నుంచి 20 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు 3793 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారుల కు సూచించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు కేంద్రాలకు చేర్చాలన్నారు. పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని హితవు పలికారు. ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, తగిన సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనెలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో నియమిస్తూ, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి చంద్రకళ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలకు డిజిటల్ ప్రొజెక్టర్ అందజేత

- ప్రియనేస్తం ట్రస్ట్ ఆధ్వర్యంలో వితరణ

**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు అన్నారు. మండలంలోని లక్ష్మీదేవి పేట మండల ప్రజా పరిషత్ పాఠశాలకు ప్రియనేస్తం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పింగిలి నాగరాజు రూ.25000 లు విలువ చేసే ఆల్ ఇన్ వన్ డిజిటల్ ప్రొజెక్టర్ ను సోమవారం భోజన విరామ సమయంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసం నాణ్యమైన విద్యను అందించేందుకు పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. లక్ష్మీదేవి పేటలోని పాఠశాలకు డిజిటల్ బోధన కోసం ఉపాధ్యాయులు కోరగానే ప్రియనేస్తం ట్రస్ట్ ఫౌండర్ పింగిలి నాగరాజు ప్రొజెక్టర్ ను అందించడం అభినందనీయమన్నారు. ములుగు జిల్లాలో నిరుపేద విద్యార్థుల అభ్యున్నతి కోసం నాగరాజు చేస్తున్న సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు. పాఠశాలలో చదివే విద్యార్థులు నిరుపేద కుటుంబాల నుంచి వచ్చే వారిని వారికి విలువలతో కూడిన విద్యను అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కోరారు. ప్రియనేస్తం ట్రస్ట్ ఫౌండర్ పింగిలి నాగరాజు మాట్లాడుతూ లక్ష్మీదేవి పేట పాఠశాల దినదినం అభివృద్ధి చెందుతుందన్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల నమోదు శాతం పెంచడంలో కృషి చేస్తున్నారని అన్నారు. అందుకు నిదర్శనమే ఎంపీపీ ఎస్ లక్ష్మీదేవి పేట పాఠశాల అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగాపూర్ ప్రధానోపాధ్యాయులు ఎండీ సర్వర్, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ విజేందర్, మాదిగ కార్యకర్త అలుగోది శ్రీకాంత్, సీనియర్ ఉపాధ్యాయులు సలేంద్రం, సాంబయ్య, అంగన్వాడీ టీచర్ మద్దెల సంధ్య, ఆయా స్వరూప విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, గొరికొత్తపల్లి :** మండలంలోని చిన్నకోడేపాక గ్రామంలో 2002-2003 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జడ్పీఎస్ఎస్ చిన్నకోడేపాక గ్రామంలో చాలా ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా 22 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ విద్యార్థులు ఆనాటి చదివిన రోజులను, జ్ఞాపకాలను ఉపాధ్యాయులతో స్కూలుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అలాగే ఇప్పుడు వారు చేస్తున్నటువంటి వృత్తిని కుటుంబ వివరాలు ఒకరికొకరు పంచుకొని రాబోయే రోజులలో మనమంతా ఒక కుటుంబం లాగా ఉండాలన్నారు. ఏ స్నేహితుడికి కష్టమొచ్చినా అందరం భరోసా ఇవ్వాలని, అందరం కలిసి మెలిసి ఉండాలని విద్యార్థులు నిర్ణయించుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న గురువులు ఆనాడు చదువు నేర్పితే ఈరోజు జీవిత పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ప్రధానోపాధ్యాయులు సాంబ లింగాచారి, నరేందర్ రెడ్డి, యాదగిరి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు జితేందర్, దేవేందర్ రెడ్డి, సురేష్, యాసీన్, సత్యనారాయణ, కొమురరెడ్డి, కుమారస్వామి, లక్ష్మితో పాటు ఆనాటి అటెండర్ భాస్కర్ తో పాటు పూర్వ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కోటగుళ్లలో భూపాలపల్లి ఎస్ఐ మచ్చ సాంబమూర్తి పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో సోమవారం భూపాలపల్లి ఎస్ఐ మచ్చ సాంబమూర్తి, సుచరిత దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దంపతులను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఐ సాంబమూర్తి జన్మదిన సందర్భంగా అర్చకులు శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

# మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు

## జిల్లా సంక్షేమాధికారి కె.శిరీష



**వరంగల్ వాయిస్, ములుగు :** మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో జిల్లాలోని అన్ని శాఖల్లో పని చేస్తున్న మహిళా సిబ్బందికి మార్చి 5, 6 న ఉదయం 10:00 నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు మహిళా క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా సంక్షేమాధికారి కె.శిరీష తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ లో నిర్వహించే ఈ క్రీడలలో భాగంగా షటిల్, టెన్నికాయిట్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, స్కిప్పింగ్, అంత్యాక్షరి, క్యారమ్స్, చెస్, సింగింగ్ వంటి వివిధ ఇండోర్ మరియు ఔట్ డోర్ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాబట్టి, ములుగు జిల్లాలోని వివిధ శాఖలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులందరూ ఈ క్రీడల్లో అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని ఇట్టి క్రీడా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# నేతాజీ పెయింటింగ్ యూనియన్ కార్మికుల సభ్యత్వ నమోదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పూర్వ మండలం కొండపర్తి నేతాజీ పెయింటింగ్ యూనియన్ కార్మికుల సమావేశం కట్కూరి రాజు అధ్యక్షతన సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా కట్కూరి రాజు మాట్లాడుతూ యూనియన్ సభ్యత్వం కార్డు ప్రతి కార్మికుడు తీసుకోవాలన్నారు. యూనియన్ ఐడీ కార్డు కోసం రూ.500 చెల్లించాలని నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈనెల 4 నుంచి 9 వరకు చెల్లించాల్సిందిగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్కూరి చంద్రమౌళి, కట్కూరి శంకర్, గద్దల ప్రభాకర్, గద్దల రాజకుమార్, బొక్కల సారయ్య, బొక్కల భిక్షపతి, బొక్కల స్వామి, బొక్కల సంపత్, బొజ్జ కుమార్, మాదాసు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# వినికిడి సమస్యను సకాలంలో గుర్తించాలి

## వైద్యాధికారి డాక్టర్ సరోజ




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** వినికిడి సమస్యలతో బాధ పడుతున్న వారిని సకాలంలో గుర్తించటం ద్వారా వారిని చెవి సమస్య నుంచి దూరం చేయవచ్చని వైద్యాధికారి డాక్టర్ సరోజ అన్నారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు చిన్న పిల్లల్లో ఈ సమస్యను ప్రాథమిక స్థాయిలోనే గురించి వైద్యుల సలహాలతో సమస్యను అధిగమించవచ్చని అన్నారు. వైద్యుల సలహా మేరకు వినికిడి యంత్రాలు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సువార్త, స్టాఫ్ నర్స్ హేమలత, ఫార్మసీస్టు లీలరాణి, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# సిద్ధార్థలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ విద్యార్థ సంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అధిరోహిస్తారని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. సమాజంలో విద్యార్థులు ఆదర్శంగా ఉండాలన్నారు. బాల్యం నుంచే మంచి అలవాట్లును అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్ రెడ్డి, మేడి రమేష్ గౌడ్ , దామెర గణేష్, వల్ల వేణు, గూగులోతు బద్రు, వైనాల రాజు, కళ్యాణ్, ఆరే రాజు, పొన్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన పెసరు విజయచందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు లావణ్య–వేణు దంపతుల ఏకైక కుమార్తె సుష్మ–ప్రశాంత్ ల నిశ్చితార్థ వేడుకకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి హాజరై, కాబోయే వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు సముద్రాల రవి, మాజీ అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, బూత్ అధ్యక్షులు అల్లె మహేందర్, బత్తిని వీరస్వామి, నకినబోయిన రమేష్, మాదిరెడ్డి సురేందర్, వజ్ర రవికుమార్, యర్రం రాంబాబు, ముద్దేర గోపాల్, చెంచు రవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం మండలంలోని నర్సక్కపల్లి, కౌకొండ, సర్వాపూర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. నరసక్కపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు జంకజువ్వ కుమారస్వామి, కౌకొండలో మేకల చిరంజీవి, సర్వాపూర్ మనోహర్ స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సమన్వయ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అర్హులైన వారికి అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల ప్రధాన కార్యదర్శి డా.మలహాల్ రావు, మాజీ జడ్పీటీసీ కోడెపాక సుమలత కరుణాకర్, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, నడికూడ మండల మహిళా అధ్యక్షురాలు భోగం కమల, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు పర్నెం మల్లారెడ్డి, పాడి ప్రతాప్ రెడ్డి, పెద్దబోయిన రవీందర్ యాదవ్, పర్నెం తిరుపతి రెడ్డి, బొల్లె భిక్షపతి, చాడ తిరుపతి రెడ్డి, శ్రీలత ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

## అందుబాటులోకి చర్లబావి నీళ్లు

## పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూర్ :** మున్సిపాలిటీ పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఫిబ్రవరి 12న తొర్రూరు పట్టణంలోని చర్ల బావి హరిపిరాల రోడ్డులోని బావులను సందర్శించి బావులను శుద్ధి చేసి పట్టణ ప్రజలకు తాగునీరు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించగా కమిషనర్ చెర్ల బావిని శుద్ధి చేయించి పట్టణ ప్రజలకు అందించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొర్రూరు మండలంలో వేసవిలో ప్రజలకు తాగునీటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురైతే తన దృష్టికి గానీ, అధికారుల దృష్టికి గానీ, ఆ ప్రాంత నాయకులకు దృష్టికి గానీ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. వేసవిలో రైతులకు సాగునీరు, తాగునీరు, ఎటువంటి విద్యుత్ సమస్యలు లేకుండా సంబంధిత అధికారులతో చర్చించి నిరాటకంగా సేవలందించడానికి మీ ఎమ్మెల్యేగా ఎప్పటికీ అందుబాటులో ఉంటానని యశస్విని రెడ్డి తెలిపారు.

# పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

## భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్ఆర్



**వరంగల్ వాయిస్, చిట్యాల :** కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం మండలంలోని ఓడితల గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన మహోత్సవంలో స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్ నేతలు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి, బద్ది పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఒడితల గ్రామంలోని కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయాలను అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేకు భక్తులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, కాంగ్రెస్ నాయకులుదొడ్డి కిష్టయ్య, కామిడి రత్నాకర్ రెడ్డి, బుర్ర లక్ష్మణ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై నిరంతర పర్యవేక్షణ

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్నారం మేడిగడ్డ బ్యారేజీల వద్ద ఇసుక లభ్యత, అనుమతులకు ప్రతిపాదనలు ఇవ్వడం, నూతన రీచ్‌లు ఏర్పాటు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ వంటి అంశాలపై రెవెన్యూ, మైనింగ్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్టమైన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. అనుమతులు లేని ఇసుక తవ్వకాలను కఠినంగా అరికట్టేందుకు రెవెన్యూ పంచాయతి రాజ్ పోలీస్ రవాణా శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు జరిపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రవాణా జరుగు ప్రాంతాలల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, మైనింగ్ ఏడీ జయరాజు, టీజీఎండీసీ పీఓ శ్రీకాంత్, డీపీఓ నారాయణ రావు, ఇరిగేషన్ ఈఈలు పరశురాం, యాదగిరి, తిరుపతి, ఆర్డీఓ రవి, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# టీబీసీ చర్చ్ స్టేజీకి రేకుల బహూకరణ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పులుకుర్తి గ్రామంలో గల టీబీసీ చర్చికి పాస్టర్ సంఘ పెద్దల ఆధ్వర్యంలో పెంచాల మల్లయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడైన మెంతుల రాజు టీబీసీ చర్చి స్టేజికి రేకులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మెంతుల రాజు, పాస్టర్ రెవరెండ్ జాన్సన్, సంఘ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆలయానికి రూ. 5016 వితరణ

**వరంగల్ వాయిస్, గణపురం** : ప్రఖ్యాతిగాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయం(గణపురం) కు అభివృద్ధిలో భాగంగా కీర్తిశేషులు బండి సాయిల్ గౌడ్ (విలేఖరి) జ్ఞాపకార్థం వారి సతీమణి స్వరూప రూ.5016 ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయానికి ఆర్థిక సాయం చేసినందుకు ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్, కమిటీ మెంబర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, మార్చి 03, 2025

# రైల్వే స్టేషన్‌లో వసతుల కల్పనపై ఎమ్మెల్యే ఆరా

- అధికారులకు పలు సూచనలు, సలహాలు
- నాలుగో నంబర్ ఫ్లాట్ ఫారం నిర్మించాలని సూచన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కొత్తగా వేస్తున్న మూడో రైల్వే లైన్ కు నాలుగో నంబర్ ఫ్లాట్ ఫారం నిర్మించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. బి. మురళీ నాయక్ రైల్వే అధికారులకు సూచించారు. సోమవారంనాడు రైల్వే మూడో లైన్ నిర్మాణ పనుల పర్యవేక్షణలో భాగంగా మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ను ఆయన సందర్శించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ రైల్వే మూడో లైన్ కు మహబూబాబాద్ రైల్వే స్టేషన్లో నాలుగో ఫ్లాట్ ఫారం తప్పనిసరిగా నిర్మించాల్సిందే అని అన్నారు. ప్రస్తుతం ఉన్న రెండు ఫ్లాట్ ఫారాలకు అదనంగా నాలుగో ఫ్లాట్ ఫారం నిర్మించకుంటే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. శ్రీనివాస్ టాకీస్ వైపు కేవలం 120 మీటర్ల బేబీ ఫ్లాట్ ఫారం మాత్రమే నిర్మించి దీనికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి ద్వారా మూడో నంబర్ ఫ్లాట్ ఫారంపై రైలు ఎక్కాల్సి ఉంటుందన్నారు. వాస్తవానికి 540 మీటర్ల ఫ్లాట్ ఫారం అవసరం ఉంటుందన్నారు. వరంగల్ తరహాలో పూర్తిస్థాయి ఫ్లాట్ ఫారం ఉంటేనే పిల్లలు, వృద్ధులు, గర్భిణీలకు ఇబ్బందులు తలెత్తవన్నారు. రోజూ వేలాది మంది ప్రయాణికులు, లక్షలాది రూపాయల ఆదాయంతో అత్యంత రద్దీగా ఉన్న స్టేషన్లో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పన అత్యవసరమని పేర్కొన్నారు. రెండు నిమిషాలు ఆగే ట్రైన్ ఎక్కాలంటే చివరి సెకన్లలో అయినా ఎక్కే అవకాశం కేవలం నాలుగో ఫ్లాట్ ఫారం ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. అలాగే ట్రైన్ వస్తే శ్రీనివాస్ టాకీస్ ఏరియాలో విపరీతమైన రద్దీ ఉంటుందని, అదనపు ఫ్లాట్ ఫారం వస్తే ఆఫీసర్స్ క్లబ్ దగ్గర కూడా ఒక గేటు పెడితే ఫలితం ఉంటుందన్నారు. అదనపు ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు లిఫ్టులు, ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాల్ కూడా అవసరమే అన్నారు. మున్ముందు మరిన్ని రైళ్లు ఆగే అవకాశం ఉన్నందున ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అమృత్ భారత్ స్టేషన్ గా ఉన్న మహబూబాబాద్ రైల్వేస్టేషన్ కు నాలుగో ఫ్లాట్ ఫారం ఉంటేనే పరిపూర్ణంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే కన్ స్ట్రక్షన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ గంటా శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ నాయకులు రామగోని రాజు, శంతన్ రామరాజు, చలమల్ల నారాయణ, మదన్ గోపాల్ లోయ, నర్సింహారావు, సిరిపురం వీరు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే మహిళా సంక్షేమం



- పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్

**వరంగల్ వాయిస్, పరకాల :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి వారి అభివృద్ధికి కృషి చేస్తుందని పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ తెలిపారు. పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం సోమవారం పరకాల పట్టణంలోని 6, 7 వార్డులలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారెంటీలపై కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ ,రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, భూమిలేని రైతు కూలీల కోసం ఆత్మీయ భరోసా తదితర కార్యక్రమాలపై కార్యకర్తలకు వివరించారు. దేశంలోనే ఎవరూ చేయని విధంగా రాష్ట్రంలో కులగనన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. దళితుల్లో సమన్యాయం కోసం ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి అభ్యర్థుల విజయానికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, చిన్నాల గోనాద్, బుర్ర రాజమౌళి, నల్లెల కుమార్, పసుల రమేష్, సదానందం గౌడ్, మడికొండ సంపత్ కుమార్, నల్లెల అనిల్, దుబాసి వెంకటస్వామి, మడికొండ శ్రీనివాస్, పబ్బ శ్రీనివాస్, సంజీవయ్య, విజయభాస్కర్, లడే శ్రీకాంత్, ఉడుత సంపత్, సతీష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా పీజేపీఎస్ 8వ వార్షికోత్సవం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** పాకాల పత్రిక విలేకరుల పరస్పర సహకార సంఘం 8వ వార్షికోత్సవం నర్సంపేట పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో సంఘం అధ్యక్షుడు కారుపోతుల విజయ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. నర్సంపేట ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో జర్నలిస్టుల అభివృద్ధే లక్ష్యంగా గత 8 సంవత్సరాలుగా జర్నలిస్టుల పరపతి సహకార సంఘం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఒకరికొరకు పరస్పరం సహకారం చేసుకుంటూ ముందుపోవాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

## ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక..

పాకాల పత్రిక విలేకరుల పరస్పర సహకార సంఘం నూతన కమిటీని ఎన్నికల అధికారులుగా పోడేటి అశోక్, కాసర్ల నరసింహరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా కోదాటి గోపాలకృష్ణ, కార్యదర్శిగా రడం శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులుగా పాలంచ సత్యనారాయణ, కోశాధికారిగా సామల అనిల్ కుమార్, సహాయ కార్యదర్శిగా కందుల శ్రీనివాస్ గౌడ్, గౌరవ అధ్యక్షులుగా వేములపల్లి వెంకటరామయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పిట్టల కుమారస్వామి, శీలం రమేష్, వడ్లకొండ పవిత్రన్ గౌడ్, తాళ్లపల్లి చంద్రమౌళి గౌడ్, కర్ల వెంకటరెడ్డి, మచ్చిక రమేష్ గౌడ్, పెండెం శివానంద్, జూలూరి హరిప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

# లక్కాకుల విశాలకు గౌరవ డాక్టరేట్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరానికి చెందిన బాటనీ అధ్యాపకురాలు లక్కాకుల విశాలకు కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందించినట్లు ఆమె ఒక స్వీయ ప్రకటనలో తెలిపారు. శనివారం న్యూఢిల్లీ మయూర్ విహార్ లో ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు విశాలకు గౌరవ డాక్టరేట్ ప్రతిని అందించారు. విశాల గత 12 సంవత్సరాలుగా పలు గురుకుల జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకురాలుగా బాటనీ బోధించారు. విశాల వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆర్గనైసేషనల్ ఆర్గనైసింగ్ సెక్రటరీగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా సేవలను గుర్తించిన కేంబ్రిడ్జి యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. సంస్థ చైర్మన్ డాక్టర్ రామానుజ స్వామి, అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు, బంధువులు, శ్రేయోభిలాషులు విశాలకు శుభాకాంక్షలు తెలిపారు.

# గుంతను తవ్వారు.. పూడ్చడం మరిచారు

## నిర్లక్ష్యంగా మున్సిపల్ అధికారుల తీరు

## ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు రెడ్డి కాలనీలో వాటర్ పైప్ లైన్ లీకేజీ మరమ్మతు కోసం వారం రోజుల క్రితం గుంతను త్వవిన మున్సిపల్ సిబ్బంది మరమ్మతుల అనంతరం గుంతను పూడ్చడం మరచిపోవడంతో అటు వైపుగా వెళ్లే వాహనదారులు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో గుంతను గమనించకుండా అటు వైపు వెళ్తే వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారని కాలనీ వాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




# నాగుర్ల వెంకటేశ్వర్లకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్ హనుమకొండ జిల్లా ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన నాగుర్ల వెంకటేశ్వర్లుకు పరకాల అరుణ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సీడ్స్ ప్రొప్రైటర్ గందే వెంకటేశ్వర్లు హార్దిక శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. గత 35 సంవత్సరాలుగా ఫర్టిలైజర్స్ ,పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ రంగంలో వరంగల్ హనుమకొండ జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ కు ఎనలేని సేవలు అందిస్తూ ఒక ప్రత్యేక పాత్రను పోషించారని కొనియాడారు. ఎరువుల పురుగు మందులు విత్తన దుకాణాల యజమానుల సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి అనునిత్యం కృషి చేస్తూ వరంగల్ జిల్లా ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగుర్ల వెంకటేశ్వర్లుకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

# కోటగుళ్లకు బంగారు అభరణాలు

## బహుకరించిన ఎన్ఆర్ఐ దంపతులు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లకు రూ. 1లక్ష 21 వేల విలువైన రెండు బంగారు గొలుసులను గణపురం మండల కేంద్రానికి చెందిన అట్లూరి జగన్ మోహన్ రావు ఉదయలక్ష్మి దంపతుల కూతురు, అల్లుడు అమెరికాలోని కాలిపోర్నియా షానోజ్ లో నివాసం ఉంటున్న రామకృష్ణ శిల్పా చౌదరి దంపతులు సోమవారం స్వామివారికి అమ్మవారికి బహూకరించారు. మొదట స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం బంగారు అభరణాలను స్వామివారికి అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయానికి బంగారు అభరణాలు అందజేసిన ఎన్ఆర్ఐ దంపతులకు కోట గుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# విదేశాల్లో విద్యనభ్యసించడానికి సదావకాశం



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ఈనెల 4న వరంగల్ ఉర్సుగుట్ట వద్ద గల తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో జెన్, గ్లోబల్ స్టడీ అడ్వైజర్ (యూఎస్ఏ ఆధారిత) సహకారంతో నిర్వహించనున్న అబ్రాడ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ –2025కు 11 దేశాల విదేశీ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు కళాశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్రావు ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో చదువుకోవడానికి ఆసక్తి చూపే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, టర్కీ, మలేషియా, ఐర్లాండ్, ఫ్రాన్స్, కెనడా, ఇటలీ, స్కాట్లాండ్ జర్మనీ వంటి ప్రతిష్టాత్మక దేశాలతోపాటు 30పైగా విదేశీ వర్సిటీల ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

# పార్కును అభివృద్ధి పరచాలి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ప్రజలకు అహ్లాదం కలిగించడానికి డివిజన్ లో ఉన్న ముకుంద లేఔట్ పార్కు మంకీ ఫుడ్ కోర్టులను అభివృద్ధి పరుస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. సోమవారం డివిజన్ లోని ముకుంద కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేటర్ మరుపల్ల రవికి వినతి పత్రం అందజేశారు. ముకుంద కాలనీలోని లేఔట్ పార్కు సుమారు రెండు వేల గజాలు ఉన్నప్పటికీ ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్కులేనందున ఈ పార్కులో పచ్చదనంతో పాటు వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నపిల్లలు ఆడుకోవడానికి పరికరాలు పూర్తిస్థాయిలో పార్కును అభివృద్ధి పరచాలని ముకుంద కాలనీ కమిటీ కోరగా 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి స్పందిస్తూ ముకుంద లేఔట్ పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచుటకు మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేల దృష్టికి తీసుకు వెళ్లనన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ముకుంద కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భూక్య వినయ్, ప్రధాన కార్యదర్శి ఉల్లి కవిత నాగరాజు, కోశాధికారి డాక్టర్ కృష్ణవేణి, ఉల్లి నాగరాజు, రజితలు ఉన్నారు.

# మిల్క్ సెంటర్ ను ప్రారంభించిన కార్పొరేటర్లు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ లో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి మిల్క్ సెంటర్ యాజమాన్యం మేరిపెల్లి వినయ్ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిలుగా 33వ డివిజన్ కార్పొరేటర్ ముష్కమల్ల సుధాకర్ అరుణ, స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లం పద్మ రవి మాట్లాడుతూ స్థానిక డివిజన్లో పాల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, ఎలాంటి కల్తీ లేకుండా డైరీ ఫార్మ్ నుండి నేరుగా వినియోగదారులకు అందించడం చాలా ఆనందదాయకం అన్నారు. స్థానిక ప్రాంత ప్రజలు ఈ పాల కేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం మేరిపల్లి వినయ్ కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ ఓంకార్, బీఎన్ రెడ్డి పేర్లను వాడితే చర్యలు

- ఎంసీపీఐ(యూ) నేత వల్లెపు ఉపేందర్ రెడ్డి
- ఎస్ హెచ్ఓకు ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అమరజీవి అసెంబ్లీ టైగర్ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు తాడిత పిడిత ప్రజల పక్షపాతి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ స్థాపించిన పార్టీ నుంచి బహిష్కృతులైన వ్యక్తులు తమ బ్రతుకు దెరువు కోసం కామ్రేడ్ ఓంకార్ భీమిరెడ్డి నరసింహారెడ్డి పేర్లను వాడుతూ ఎంసీపీఐ పేరుతో చరిత్రను వక్రీకరించి అప్రతిష్ట పాలు చేయాలని చూస్తే ఊరుకోబోమని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎంసీపీఐ(యూ) పోలిట్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) – ఎంసీపీఐ(యూ) ఉమ్మడి జిల్లా ప్రతినిధి బృందం ఎంసీపీఐ పేరుతో ఓంకార్, బీఎన్ రెడ్డిల చరిత్రను వాడుకుంటూ అప్రతిష్ట పాలు చేస్తున్న మోర్తాల చందర్ రావు, సింగతి సాంబయ్య, లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, మర్రెడ్డి వెంకట్ రెడ్డి, పానుగంటి నర్సయ్య, మరికొంత మందిపై స్థానిక మిల్స్ కాలనీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్ హెచ్ఓ) వెంకటరత్నంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వల్లెపు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ 1984 సంవత్సరంలో అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ స్థాపించిన ఎంసీపీ కాలక్రమంలో ఎంసీపీఐ తదనంతరం ఎంసీపీఐ(యూ) గా మార్పు చెంది ఎన్నికల నిబంధనావళిని అనుసరించి రిజిస్ట్రేషన్ చేసుకొందనన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు వర్గ సామాజిక సమస్యలపై ఉద్యమిస్తూ చట్టసభలో పోటీ చేస్తూ పార్టీ కార్యక్రమాన్ని అమలు చేస్తూ అమర జీవులు కామ్రేడ్ ఓంకార్ భీమిరెడ్డి నరసింహారెడ్డి చూపిన బాటలో అమరవీరుల త్యాగాల పునాదులపై దేశవ్యాప్తంగా పురోగమిస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ వ్యతిరేక కార్యాకలాపాలకు ఆర్థిక అరాచకత్వానికి పాల్పడినందున మోర్తాల చందర్రావు, సింగతి సాంబయ్య, లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మర్రెడ్డి వెంకటరెడ్డి, పానుగంటి నరసయ్య, మరికొంత మంది వివిధ సందర్భాల్లో పార్టీ నుంచి బహిష్కరించడం జరిగిందని, అలాంటివారు ఈ మధ్యకాలంలో వరంగల్ పట్టణంలో పార్టీ పేరును, వ్యవస్థాపకులు కామ్రేడ్ ఓంకార్, కామ్రేడ్ బీఎన్ రెడ్డి పేర్లను వాడుకుంటూ వారి స్వార్ధపూరిత ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలు చట్టరీత్య వ్యతిరేకమని, ఇలాంటి పద్ధతులను తక్షణమే మానుకొని ఓంకార్, బీఎన్ రెడ్డిల పేర్లను వారు స్థాపించిన పార్టీని వాడటం ఉపసంహరించుకోవాలని లేకపోతే తగిన పద్ధతులలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, వరంగల్ హనుమకొండ జిల్లా కార్యదర్శులు పెద్దారపు రమేష్, ఎన్ రెడ్డి హంసారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నర్ర ప్రతాప్, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ రంయ్యాల శ్రీధరాచార్యులకు విశ్వ శాంతి ఉగాది జాతీయ పురస్కారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ ఆర్యాణి సకల వేదిక ఆధ్వర్యాన రవీంద్ర భారతిలో జరిగిన కార్య క్రమంలో వ్యాఖ్యాత, గాయకులు డాక్టర్ రంయ్యాల శ్రీధరాచార్యులకు విశ్వశాంతి జాతీయ ఉగాది పురస్కారం ప్రదానం చేసి సత్కరించింది. సంస్థ అధినేత డాక్టర్ దూడపాక శ్రీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీ దర్శకులు సముద్ర మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో విభిన్న రంగాల్లో సేవలందిస్తున్న వారిని అవార్డులతో సత్కరిస్తున్న సంస్థ అధ్యక్షులు డాక్టర్ దూడపాక శ్రీధర్ కు అభినందనలు తెలియజేస్తూ మరెన్నో గొప్ప కార్య క్రమాలు నిర్వహించారని అవార్డు గ్రహీతలందరికి అభినందనలు తెలిపారు. ఇంకా ఈ కార్య క్రమంలో నటి మోడల్ మిస్ యూనీవర్స్ ట్రాన్స్ కుమారి మేకల హర్షిణి, సంగీత నాట్య గురువు శ్రీమతి బి. కె అపర్ణ, కవి విమర్శకులు శతాధిక పుస్తక ప్రచురణ కర్త డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, కళాపోషకులు, పారిశ్రామిక వేత్త అరిసేన పల్లి శ్రీనివాస్, సీనియర్ సెలబ్రేటి మేకప్ ఆర్టిస్ట్ కుంచాల లావణ్య, సెలబ్రేటి ప్రోమేకప్ ఆర్టిస్ట్ తుమ్మ స్రవంతి అతిథులుగా పాల్గొన్నారు. సంస్థ ప్రధాన కార్య దర్శి మణి రాయల్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా డాక్టర్ రంయ్యాల శ్రీధరాచార్యులు వ్యవహరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని యాభైకి పైగా విభిన్న రంగాల్లో సేవలందిస్తున్న వారికి జాతీయ స్థాయి ఉగాది పురస్కారాలు అందచేసి సత్కరించింది.

# సంరక్ష హాస్పిటల్ కు రెండు పీజీ సీట్లు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో కేంద్ర ప్రభుత్వ మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ డీజీహెచ్ఎస్ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ లు ఫ్యామిలీ వెల్ఫేర్ వారిచే ఆర్థోపెడిక్ విభాగంలో రెండు పీజీ కోర్సుల సీట్లు మంజూరు చేసిందని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. వరంగల్ లో




ఆర్థోపెడిక్ విభాగంలో డీఎన్ బీ సీట్లు మంజూరైన ఏకైక హాస్పటల్ గా సంరక్ష హాస్పిటల్ గుర్తింపు పొందింది. గత ఎనిమిది సంవత్సరాలుగా వైద్య విభాగంలో ఉత్తమ ప్రమాణాలతో వైద్య సేవలు అందించిన సంరక్ష హాస్పిటల్ కు కేంద్ర ప్రభుత్వంచె దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నామని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి డీఎన్ బీ కోర్సులో ప్రవేశం పొందిన డాక్టర్ హిమాలయ గుప్తాకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏప్రాన్ , స్టెత్ ను బహుకరించారు. పెద్ద ఎత్తున జరిగిన ఈ కార్యక్రమంలో సంరక్ష హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ దొడ్డ రమేష్, వైస్ చైర్మన్ డాక్టర్ కె.తిరుపతిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దిడ్డి శ్రవణ్, డాక్టర్ అజిత్ మహమ్మద్, డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ సంధ్య, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ పోలా నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వన్నాల విజయలక్ష్మి.. కన్నుమూత

- శ్రీరాములు రాజకీయ ప్రస్తానంలో ఆమెది ప్రముఖ పాత్ర
- మాజీ ఉపరాష్ట్రపతి, పలువురు గవర్నర్లు, పద్మశాలీల సంతాపం
- హనుమకొండలో ముగిసిన అంత్యక్రియలు

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు సతీమణి విజయలక్ష్మి (70) కన్నుమూశా రు. గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఆమెది వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామం కాగా హనుమకొండ బాలసముద్రం అడ్వకేట్స్ కాలనీలో స్థిరపడ్డారు. వీరికి ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ తండ్రి శ్రీరాములు వారసత్వాన్ని పునికి పుచ్చుకొని భారతీయ జనతా పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. రెండో కుమారుడు అరవింద్ హైదరాబాదులో, చిన్న కుమారుడు రాజేష్ ఖన్న అమెరికాలో స్థిరపడ్డారు. వన్నాల శ్రీరాములు బీజేపీలో ఎదగడంతోపాటు ఎమ్మెల్యే కావడంలో విజయలక్ష్మి పాత్ర ఎంతో ఉంది. ఆయన రాజకీయాల్లో క్షణం తీరిక లేకుండా ఉంటే విజయలక్ష్మి కుటుంబం బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ముగ్గురు కుమారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారు.




బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల గుండెల్లో కొలువైన వన్నాల విజయలక్ష్మి అలియాస్ జయక్క శకం ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆమె తుది శ్వాస విడిచారు. వైద్యులు శాయశక్తుల ప్రయత్నించినా లాభం లేకపోయింది. చివరికి తీవ్ర ఉత్కంఠ మధ్య 'జయక్క'ఇక లేరు అంటూ వైద్యులు ప్రకటించారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానుల గుండెలు పగిలాయి. రోదనలు మిన్నంటాయి. విజయలక్ష్మి మృతి పట్ల మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, గవర్నర్లు బండారు దత్తాత్రేయ, నల్లు ఇంద్రసేనారెడ్డి, కె.హరిబాబు, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజకీయ కురువృద్ధుడు వన్నాల శ్రీరాములు రాజకీయంగా ఎదగడంలో ఆయన సతీమణి విజయలక్ష్మి పాత్ర ఎంతో ఉంది. ఆయన జనసంఘ్, భారతీయ జనతా పార్టీ క్రియాశీలక రాజకీయాల్లో తల మునకలై ఉన్నప్పుడు అనునిత్యం ఆమె వెన్నంటి ఉన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని ధైర్యం, సడలని సంకల్పం, ముళ్లబాటను పూలబాటగా మలుచుకుని జనం గుండెల్లో చెరగని స్థానాన్ని విజయలక్ష్మి సంపాదించుకున్నారు.

### ప్రగాఢ సానుభూతి..

వన్నాల విజయలక్ష్మి మృతి పట్ల బీజేపీ నాయకులు, పద్మశాలి సంఘం, పోపా సంఘాలతో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర సంతాపం తెలిపారు. ఆమెకు సంతాపం తెలిపిన వారిలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, చల్ల ధర్మారెడ్డి, శంకర్ నాయక్, మాజీ మేయర్లు డాక్టర్ టి.రాజేశ్వరరావు, ఎర్రబెల్లి స్వర్ణ, బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, కోలను సంతోష్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు రావు పద్మ, ఎర్రబెల్లి వరదరాజేశ్వరరావు, కన్నెబోయిన రాజయ్య యాదవ్, ఆత్మకూరు సుధాకర్ రెడ్డి, గజ్జల శ్రీరాములు, అనోద రాజయ్య, బీజేపీ నేతలు రావు అమరేందర్ రెడ్డి, వంగాల, చాడ శ్రీనివాసరెడ్డి, గుజ్జుల వసంత, వాసు దేవ రెడ్డి, ముంద్రాతి వెంకటేశ్వర్లు, కుసుమ సతీష్, గురజాల శ్రీరామ్ రెడ్డి, కె.జితేందర్ రెడ్డి, బైరి శ్రావణ్ కుమార్, మురళీ మనోహర్ తదితరులు ఉన్నారు.

### పద్మశాలి సంఘం సంతాపం..

వన్నాల విజయలక్ష్మి మృతిపై అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, వడ్నాల నరేందర్, వడ్నాల మల్లయ్య, గజ్జెల్లి రవీందర్, విద్యావేత్తలు రామ చంద్రమౌళి, గుర్రపు దామోదర్, రుద్ర సాయి బాబా, దుస్స జనార్ధన్, చందా మల్లయ్య, వంగరి సూర్యనారాయణ, పోపా సంఘం బాధ్యులు గుండు కామేశ్వర్, పాము శ్రీనివాస్, రాజ గోవిందు, జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, వల్లాల వెంకటరమణ, చెరుకు వేణు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

### కన్నీటి వీడ్కోలు..

దివంగత వన్నాల విజయలక్ష్మికి ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. సోమవారం ఆమె అంత్యక్రియలు హనుమకొండ పద్మాక్షి కాలనీలోని శ్మశాన వాటికలో జరిగాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజల సమక్షంలో చిన్న కుమారుడు రాజేష్ ఖన్నా చితికి నిప్పంటించారు. స్థానిక కార్పొరేటర్ రావుల కోమల భర్త రావుల కిషన్, దాసరి ప్రేమ్ సాగర్, గాడి పెల్లి రాజేశ్వరరావు, వేముల ఆంజనేయులు, వేముల నాగరాజు, వేముల సదానందం, టీచర్ శ్రీనివాస్ తదితరులు దగ్గరుండి అంత్యక్రియల కార్యక్రమాన్ని పూర్తి చేయించారు. బీజేపీ ముఖ్య నేతలు అంతా ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. విజయలక్ష్మి సొంత గ్రామమైన వర్ధన్నపేటనుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.












గడ్డం కేశవమూర్తి

# నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

- సీఎం రేవంత్ నాయకత్వంలో వరంగల్ దశ, దిశ మారనుంది
- రాష్ట్ర ప్రభుత్వం కృషితోనే ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్
- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ నగర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిలతో కలిసి కడియం కావ్య పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం కృషి వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కడియం కావ్య పునరుద్ఘటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ దశ, దిశ మరబోతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రెండో రాజధానిగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుల తీరు విచిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు. పనిచేసింది ఒకరైతే మేమే తెచ్చామని చెప్పుకొవడం సిగ్గు చేటని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్ఓసీ కొరకు ఒక్కసారైనా ప్రయత్నం చేశారా అంటూ సూటిగా ప్రశ్నించారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉండడంతో దీనిపై సీఎం రేవంత్ రెడ్డి పౌర విమానయానశాఖతో చర్చించి గత నెల 25న ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ కు లేఖ రాయడం జరిగిందని పేర్కొన్నారు. దీనిని హెచ్ఏఎల్ కు పంపడంతో అక్కడి నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ రావడంతో మామునూరు ఎయిర్ పోర్ట్ కు కేంద్రం అనుమతినిచ్చిందని గుర్తు చేశారు. విమానాశ్రయ విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణ కోసం రూ.205 కోట్లను విడుదల చేస్తూ.. ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలియజేసారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణం అద్భుతంగా ఉండబోతుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఏయిర్ పోర్ట్ అభివృద్ధితో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, టెక్స్ టైల్ పార్క్, ఐటీ, పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నారని వెల్లడించారు.

వరంగల్ మహానగరంలో 20 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తున్నామని కడియం కావ్య ప్రకటించారు. రైల్వే సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. రైల్వే డివిజన్ ఏర్పాటు విషయంపై కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కులుస్తామని తెలిపారు. కాజీపేట రైల్వే బ్రిడ్జి పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రానున్న రోజుల్లో వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధులు అందరం కలిసి కట్టుగా జిల్లాను మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు.



# నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- ఉపాధి హామీ పనులు, పురోగతిపై అధికారులతో సమీక్ష

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉపాధి హామీ పనులకు సంబంధించి మండలాలకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, వాటి పురోగతి, నిర్దేశిత లక్ష్యం పూర్తి చేయడంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మార్చి నాటికల్లా మంజూరైన పనులు, ఇప్పటి వరకూ చేపట్టిన పనులు, పనులకు సంబంధించిన ప్రణాళిక, ఇతర అభివృద్ధి పనులపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని మండలాలలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన పనుల శాతాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను జిల్లా కలెక్టర్ కు వివరించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిని ఎస్ఈ శంకరయ్య కలెక్టర్ కు నివేదించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అన్ని మండలాల్లో ఉపాధి హామీ పనులను నిర్దేశిత లక్ష్యాన్ని చేరే విధంగా గడువులోగా పూర్తిచేసే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులలో కూలీల భాగస్వామ్యం పెంచాలని, అదే విధంగా నిర్దేశిత లక్ష్యం సాధించి ఉపాధి హామీ పథకానికి సంబంధించి మెటీరియల్ ను సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి పనులకు సంబంధించిన పనులు, బిల్లుల చెల్లింపుల వివరాల రోజువారీ నివేదికను ఎంపీడీవోలు సమర్పించాలన్నారు. నిర్దేశిత గడువు తక్కువగా ఉన్నందున ప్రతిరోజు పనులలో పురోగతి ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీఆర్డీఓ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఏఈలు పాల్గొన్నారు.





# మిస్టరీ వీడింది..

- నిందితుడు దొరికిండు
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా
- పోలీస్ అధికారులకు నగదు పురస్కారం

**వరంగల్ వాయిస్, క్రైం :** గత రెండు సంవత్సరాలుగా మిస్టరీగానే మిగిలిపోయిన కేసును చేధించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచన పరకాల ఏసీపీ సతీష్‌బాబుతో పాటు శాయంపేట సర్కిల్ ఇన్ స్పెక్టర్ రంజిత్‌లను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించడంతోపాటు వారికి నగదు పురస్కారాలు అందజేశారు. వివరాల్లోకి వెళితే రెండు సంవత్సరాల క్రితం పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో జరిగిన ఓ వృద్ధురాలి హత్యకేసులో పరకాల పోలీసులకు ఎలాంటి క్లూస్ లభించలేదు. దీనికి తోడు పలువురు ఇన్ స్పెక్టర్లు బదిలీ కావడంతో ఈ కేసు ఓ మిస్టరీగానే నిలిచిపోయింది. వరంగల్ పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తును శాయంపేట సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ రంజిత్ కు అప్పంగించడం జరిగింది. దీంతో పరకాల ఏసీపీ పర్యవేక్షణలో ఈ హత్య కేసు దర్యాప్తు చేపట్టిన రంజిత్ కొద్ది రోజుల్లోనే హత్యకు గురైంది శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలిగా గుర్తించారు. బంగారు అభరణాల కోసం అదే గ్రామానికి చెందిన ఇంటి రాజిరెడ్డి వృద్ధురాలిని నమ్మించి తీసుకువెళ్లి ధర్మారం గ్రామ శివారులో దారుణంగా హత్య చేసినట్లు సర్కిల్ ఇన్ స్పెక్టర్ దర్యాప్తులో బయటపడింది. దీంతో వృద్ధురాలి హత్యకు కారణమైన రాజిరెడ్డిని గత నెలలో పరకాల పోలీసులు అరెస్టు చేసిన రిమాండ్ తరలించారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉండి పోలీసులకు ఓ సవాలుగా నిలిచిన ఈ హత్యకేసును ఛేదించడంలో ప్రతిభ కబరిచిన పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ నగదు పురస్కారాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రవీందర్ పాల్గొన్నారు.

# బీసీల పల్లెబాట విజయవంతం కావాలి

- ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు భాస్కర్
- సోమేశ్వర ఆలయంలో పూజలు



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన పల్లెబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కుడికాల భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుడికల భాస్కర్ మాట్లాడుతూ గ్రామాల్లో బీసీల చైతన్యం, ఐక్యతను బలపరచాలన్నారు. మేమెంతో మాకంత వాటా పేరుతో జరుగుతున్న పల్లెబాట కార్యక్రమం బీసీలను కదిలించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బీసీలు, ప్రజా సంఘాలు, అంబేద్కర్ వాదులు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జనాభాలో సగభాగమైన బీసీలు వారి హక్కుల సాధన, అభివృద్ధి కోసం జరుగుతున్న పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి పల్లెను కదిలించడమే లక్ష్యంగా పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసబట్టు మస్తుసూదన్ రాజ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి జినుకల లక్షమాన్ రావు వరంగల్ జిల్లా అధ్యక్షులు గజవెల్లి మనోహర్, జిల్లా నాయకులు గజవెల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# డీజే సౌండ్స్ పెడితే జైలుకే

## వరంగల్ ఏసీపీ బి.నందిరామ్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఇంటర్మీడియట్, పదో తరగతితోపాటు ఇతర పోటీ పరీక్షలు ఉన్నందున వివాహ ఊరేగింపులతో పాటు ఇతర వేడుకల్లో డీజే సౌండ్స్ పెడితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏసీపీ బి.నందిరామ్ హెచ్చరించారు. అదే విధంగా డీజేలను సీజ్ చేస్తామని వారిని జైలుకు పంపిస్తామన్నారు. డీజేలతో విద్యార్థులు, వృద్ధులు, చిన్న పిల్లలకు, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. డీజేల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com